# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-11-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **నదుల అనుసంధానం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాలకూ నీళ్లు అందిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
2. **రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**
3. **గేమింగ్, యానిమేషన్ రంగాల్లో ప్రతిభావంతులను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలను చేపడుతోందని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు.**
4. **దేశవ్యాప్తంగా ఈ రోజు నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు.**
5. **భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

గోదావరి నుంచి కృష్ణాకు అక్కడి నుంచి పెన్నా నది అనుసంధానం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాలకూ నీళ్లు అందిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నదుల అనుసంధానంపై జలవనరులశాఖ అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఇప్పటికే గోదావరి, కృష్ణాను అనుసంధానం చేసి లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని అన్నారు. కృష్ణానదికి వరద ఉన్నరోజుల్లో ఆ నీటినే తీసుకువెళ్లేలా, లేని రోజుల్లో గోదావరి వరద మళ్లించేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

--------------------------

కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. శాసన సభ సమావేశాల్లో భాగంగా విశాఖ మెట్రో రైలుపై శాసనసభ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుపై సమగ్ర నివేదికను సిద్ధం చేశామన్నారు. విశాఖపట్నంలో మొత్తం 76.90 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపడతామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ ..42 సెకన్లు

---------------------------

రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో తెలంగాణలో ఖరీఫ్ ధాన్యం సేకరణపై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించి జిల్లాలవారీగా పరిస్థితుల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా రానున్న వారం, పది రోజుల్లో ధాన్యం.. కొనుగోలు కేంద్రాలకు వస్తుందని, అందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.

---------------------------

గేమింగ్, యానిమేషన్, వినోద రంగాల్లో ప్రతిభావంతులను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలను చేపడుతోందని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. హైదరాబాద్‌లో ఇండియా గేమ్ డెవలపర్ కాన్ఫరెన్స్ –ఐజీడీసీను నిన్న ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంజయ్ జాజు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... ప్రపంచ మీడియా, వినోద రంగంలో భారత్ వాటా ప్రస్తుతం 2 శాతమేనని, దానిని 20 శాతంపైగా పెంచుకునేందుకు అవకాశాలున్నాయని తెలిపారు. ఈ నెల 20వ తేదీన గోవాలో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రసార భారతి సొంత ఓటీటీ ప్లాట్ ఫామ్‌ను ప్రారంభించనుందని తెలిపారు. భారతీయ సంస్కృతి ఆధారంగా ఆటలను రూపొందిస్తామని సంజయ్ జాజు తెలుపుతూ,

వాయిస్ (33 సెకన్లు)

---------------------------

దేశవ్యాప్తంగా ఈ రోజు నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. 1919లో ఆంధ్ర గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో అయ్యంకి వెంకటరమణయ్య మద్రాస్‌లో రెండు రోజులపాటు నవంబర్ 14, 15 తేదీలలో జాతీయ గ్రంథాలయ సదస్సును నిర్వహించారు. తెలుగువారు విజయవంతంగా నిర్వహించిన తొలి జాతీయ సదస్సు జరిగిన తేదీలను జాతీయ గ్రంథాలయ దినోత్సవంగా ప్రకటించారు. 1968 నుంచి భారత ప్రభుత్వం గ్రంథాలయాలకు జాతీయ వ్యాప్తంగా వారోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది. అప్పటి నుండి ప్రతి యేటా వారం రోజులపాటు నవంబర్ 14 నుండి 20వ తారీకు వరకు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఉప సభాపతిగా పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గ సభ్యుడు కె. రఘురామ కృష్ణంరాజు తెలుగు దేశం, జన సేన, భారతీయ జనతా పార్టీ కూటమి అభ్యర్థిగా నిన్న నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, పయ్యావుల కేశవ్, కింజరాపు అచ్చెన్నాయుడు, సత్య కుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు. ఆయన తరపున కూటమి నేతలు శాసన సభ ప్రధాన కార్యదర్శికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ రోజు మధ్యాహ్నం 12 గంటలకు ఉప సభాపతి ఎన్నిక జరుగుతుంది. ఈ పదవికి మరెవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో రఘురామ కృష్ణంరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ఉంది.

---------------------------

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైలును నడుపుతోంది. ఈరోజు ఎస్ఎంవీటీ బెంగళూరు –మాల్దా టౌన్ అన్‌రిజర్వ్‌డ్ ప్రత్యేక రైలు నడపనున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక రైలు ఈ రోజు ఉదయం బెంగళూరు నుండి బయలుదేరి, రేపు దువ్వాడ చేరుకుని, విజయనగరం మీదుగా మాల్దా టౌన్ చేరుకుంటుందని చెప్పారు. ఈ రైలు ఆంధ్రప్రదేశ్‌లో రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, విజయనగరం రైల్వే స్టేషన్లలో ఆగుతుందని ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ సూచించారు.

---------------------------

భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా ఈరోజు జరుపుకుంటున్నాం. ఉత్తర ప్రదేశ్‌లోని అలహాబాద్‌లో 1889 నవంబర్ 14న ఆయన జన్మించారు. లండన్‌లో న్యాయ విద్యను అభ్యసించిన అనంతరం అలహాబాద్‌లో న్యాయవాద వృత్తిని చేపట్టినప్పటికీ, జాతిపిత మహాత్మాగాంధీ ప్రేరణతో జాతీయోద్యమంలో ప్రవేశించి పలుమార్లు జైలు జీవితం గడిపారు. స్వాతంత్ర్యానంతరం 1947 ఆగష్టు 15వ తేదీన ఏర్పడిన జాతీయ ప్రభుత్వంలో ఆయన ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

---------------------------

ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో నిన్న పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ...

వాయిస్ (27 సెకన్లు)

---------------------------

పరిశ్రమల ఏర్పాటుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, వెనుకబడిన కొడంగల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. పరిశ్రమలు రావాలంటే భూ సేకరణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా భూమిని కోల్పోతున్న వారికి పరిహారంతో పాటు పరిశ్రమలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. కొందరు ప్రజలను రెచ్చగొట్టి వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై ఉద్దేశపూర్వకంగానే దాడి చేయించారని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఉపముఖ్యమంత్రి తెలిపారు.

======================